ప్రజాశక్తి
శనివారం 20 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

## దోపిడీదారులు కావాలో... ప్రజా సేవకులు కావాలో...

# విజ్ఞతతో ఆలోచించండి

- ఇండియా వేదిక బలపరచిన సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావు విజ్ఞప్తి
- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ ● అడుగడుగునా ఘన స్వాగతాలు, హారతులు
- రెపరెపలాడిన వేదిక జెండాలు ● ఎండను సైతం లెక్క చేయకుండా ర్యాలీలో పాల్గొన్న శ్రేణులు

ర్యాలీలో ఇండియా వేదిక శ్రేణులు; సభలో మాట్లాడుతున్న పి.మధు, నామినేషన్ వేస్తున్న సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** స్వాతంత్ర్య సమరయోధుల భూములు, భూదందాలు, భూకబ్జాలు, గుడి, గుడిలోని లింగాలను దోచుకునే వారు కావాలో, నిరంతరం ప్రజలతో ఉంటూ ప్రజాసేవ చేసే వారు కావాలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని సిపిఎం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు కోరారు. కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ, ఆర్‌జెడి, ఇండియా వేదిక బలపరచిన కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ, ఆర్‌జెడి, ఇండియా వేదిక బలపరచిన సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ (మిగతా 2లో)

ర్యాలీలో ఇండియా వేదిక శ్రేణునలు, వాహనంపై నుండి అభివాదం చేస్తున్న సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, చిత్రంలో కె.రామకృష్ణ, వై.వెంకటేశ్వరరావు తదితరులు

# సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు నామినేషన్

- ఉత్సాహంగా సాగిన ఇండియా వేదిక ర్యాలీ
- ఘన స్వాగతం పలికిన ప్రజలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఇండియా వేదిక బలపరచిన సిపిఐ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి.కోటేశ్వరరావు నామినేషన్ దాఖలు సందర్భంగా శుక్రవారం వన్‌టౌన్లో భారీ ప్రదర్శన జరిగింది. మండు టెండలో సైతం ఇండియా వేదిక శ్రేణులు ముందుకు సాగాయి. ఓట్ ఫర్ వర్కర్స్... వీ వాంట్ కామ్రేడ్ నినాదాలతో పశ్చిమ నియోజకవర్గం మార్మోగింది. జి.కోటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమం ఆద్యంతం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కెఎల్ రావు పార్క్ వద్ద నుంచి భవానీపురంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు సాగిన ర్యాలీ ఉత్సాంగా సాగింది. ఎర్రచీరలు ధరించిన మహిళా కార్యకర్తలు, ఎర్రచొక్కాలు ధరించిన పురుష కార్యకర్తలు ఎర్రజెండాలు పట్టుకుని క్రమశిక్షణతో ముందునడిచారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, కార్యకర్తల నత్యాల నడుమ ర్యాలీ అద్భుతంగా సాగింది. కలరా (మిగతా 2లో)

సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులతోపాటు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

# పక్షపాతంలేకుండా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ

## ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్

**ప్రజాశక్తి - విజయవాడ :** ఎన్‌టిఆర్ జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఈసీఐ మార్గదర్శకాలకు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పక్షపాతంలేకుండా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ జరిగేలా అధికారులు కృషిచేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ (ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్) సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్ శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు మదన్ కుమార్ హాజరయ్యారు. 16 విభాగాల నోడల్ అధికారులు కూడా హాజరైన ఈ సమావేశంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో పనిచేసి వ్యయ పర్యవేక్షణను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సహాయ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, అకౌంటింగ్ బందాలు ఎలాంటి వివక్షకు (మిగతా 2లో)

# 26 నామినేషన్లు దాఖలు

## ఎన్‌టిఆర్ జిల్లాలో 18, కృష్ణాలో నామినేషన్లు

**ప్రజాశక్తి - విజయవాడ :** ఎన్‌టిఆర్ జిల్లాలో నామినేషన్ల రెండో రోజైన శుక్రవారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో మొత్తం 26 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 18, కృష్ణాజిల్లాలో 8 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్‌కు మూడు నామినేషన్లు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు 15 నామినేషన్లు వేశారు. విజయవాడ పార్లమెంట్‌కు టిడిపి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఒక సెట్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) అభ్యర్థి పేరం శివనాగేశ్వరరావు రెండు సెట్లు, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థి బి.శ్రీనివాసరావు రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీకి వైసిపి అభ్యర్థి షేక్ ఆసిఫ్, సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, ఎంసిపిఐ (యు) అభ్యర్థి ఖదీర్ బాషా షేక్, స్వతంత్ర అభ్యర్థి రత్నావత్ కిశోర్ కుమార్ ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ సెంట్రల్ అసెంబ్లీకి సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావు, టిడిపి (మిగతా 2లో)

# ప్రచార కూలీలు వచ్చేశారహో..!!

కథనం మధ్య పేజీలో

# బొండా ఉమా ఇంటి వద్ద ఉద్రిక్తత

- పెద్దఎత్తున తరలి వచ్చిన పోలీసులు
- ఏక్షణమైనా అరెస్ట్ చేస్తారనే ప్రచారం
- తరలి వచ్చిన టిడిపి శ్రేణులు
- సిఎం జగన్‌కు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు

**ప్రజాశక్తి-విజయవాడ :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు ఇంటి వద్ద, అలాగే సింగ్‌నగర్‌లోని ఆపార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన రాయిదాడి ఘటన వెనుక బొండా ఉమా పాత్ర ఉండవచ్చనే దిశగా గత రెండు రోజుల నుంచి జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలోనే బొండాను అరెస్ట్ చేస్తారనే ఊహగానాలు పెద్దఎత్తున ప్రచారం జరుగుతుండటంతో ఇటు ఉమా ఇంటి వద్దకు, ఇటు కార్యాలయం వద్దకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, పోలీసులకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇల్లు, కార్యాలయం వద్ద పెద్దఎత్తున నినాదాలు చేస్తూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏదైనా అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బొండా ఉమా ఇంటి వద్దకు, కార్యాలయం వద్దకు పోలీసులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

జికోటేశ్వరరావు

బొండా ఉమా



బోడే ప్రసాద్

## 26 నామినేషన్లు దాఖలు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థి బొప్పన గాంధీ, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి కె.శివశంకర్ ఒక్కో సెట్ నామినేషన్లు వేశారు. విజయవాడ తూర్పు అసెంబ్లీకి టిడిపి తరపున గద్దె

కేశినేని చిన్ని

షేక్ ఆసీఫ్

రామమోహనరావు, గద్దె అనూరాధ, గద్దె క్రాంతికుమార్ ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మైలవరం అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థులు వేములపల్లి పథ్వి, వేల్పూరి కనకదుర్గాదేవి ఒక్కో సెట్ నామినేషన్లు వేశారు. జగ్గయ్యపేట అసెంబ్లీకి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి కర్నాటి అప్పారావు, టిడిపి అభ్యర్థి రాజగోపాల శ్రీరామ్ (తాతయ్య) ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నందిగామ, తిరువూరు అసెంబ్లీలకు ఎవరూ నామినేషన్లు వేయలేదు.

### కృష్ణాలో 8 నామినేషన్లు

మచిలీపట్నం పార్లమెంట్‌కు 1, అసెంబ్లీలకు 7

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో మొత్తం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంట్‌కు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున బడుగు క్రాంతి కుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గుడివాడ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున వడ్డాది గోవింద్ రావు, బిఎస్‌పి తరపున గుడివాడ బోసు బాబు, అవనిగడ్డ అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా నాదెళ్ల గిరిధర్ నాయుడు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే పెనమలూరు అసెంబ్లీకి టిడిపి తరపున బోడే ప్రసాద్ రెండు సెట్లు, బోడే హేమ చౌదరి రెండు సెట్లు దాఖలు చేశారు.

## 21న యుపిఎస్‌సి పరీక్షలు

### ఏర్పాట్లపై కలెక్టర్ డిల్లీరావు సమీక్ష

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ఈనెల 21న జరిగే యుపిఎస్‌సి పరీక్షలను లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపిఎస్‌సి) నిర్వహించే పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్లో వెన్యూ సూపర్వైజర్లు, లైజన్ కం ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌టిఎ), నేవల్ అకాడమీ (ఎన్‌ఎ), సిడిఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీస్) పరీక్షలను యుపిఎస్‌సి నిర్వహించనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,872 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకు ఐదు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు ఉదయం 9.00 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2.00 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు రూటు అధికారులతోపాటు ఐదుగురు లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూములలో భద్రపరచినట్లు తెలిపారు. సకాలంలో పరీక్షా పత్రాలు కేంద్రాలకు చేరుకునేలా రూటు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

## దోపిడీదారులు కావాలో...ప్రజా సేవకులు కావాలో... విజ్ఞతతో ఆలోచించండి

పుండ్కర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో బాబూరావు మాట్లాడుతూ వైసిపి, టిడిపి ప్రభుత్వాల హయాంలో విజయవాడ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఏరోజు ఏ పార్టీలో ఉంటారో తెలియకుండా పార్టీలు మార్చే నాయకులకు, పూటకో కండువా కప్పుకునే అభ్యర్థులకు ఓటు వేస్తే ప్రయోజనం ఉండదన్నారు. జీవితాంతం ఒకే పార్టీలో ఉంటూ ప్రజల కోసం జీవించే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. కమ్యూనిస్టుల హయాంలోనే విజయవాడలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కమ్యూనిస్టులను, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా విజయవాడను మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### నగరంలో భారీ ర్యాలీ

ఈసందర్భంగా అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సెంటరులో సభ జరిగింది. అనంతరం పైపుల రోడ్డు నుంచి భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ కృష్ణా హోటల్ సెంటర్, డాబాకొట్లు బజార్, ముత్యాలంపాడు, భగత్‌సింగ్ రోడ్డు, సత్యానారాయణపురం శివాజీ కేఫ్, ఊర్వసి సెంటర్ మీదుగా అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వరకు సాగింది. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, ఆర్‌జెడి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు ముఠా, ఆటో, హాకర్స్, బిల్డింగ్, ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు వేలాది మంది పాల్గొన్నారు. ఆయా పార్టీల జెండాలు, టోపీలు, ప్లకార్డులు చేబూని ర్యాలీలో ముందుకు సాగారు. డిజె మైక్, దానిననుసరిస్తూ డబ్బు కళాకారుల నృత్యాలు, భారీ బ్యానర్ చేబూని, ఎర్రచీరలు ధరించిన మహిళలు నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రత్యేక వాహనంలో అభ్యర్థి సిహెచ్.బాబూరావుతోపాటు ఆయా పార్టీల నేతలు, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజా సంఘాల నేతలు ఉన్నారు. ఎంతో క్రమశిక్షణగా నగరంలోని పైపుల రోడ్డు దగ్గర నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో డప్పు కళాకారుల డప్పునృత్యాలు మారుమోగుతూ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిపిఎం జెండాలు రెపరెపలాడాయి. ఎండను సైతం లెక్క చేయకుండా శ్రేణులు ర్యాలీలో నడిచాయి. బాబురావు గెలుపు...మనందరి గెలుపు, సిపిఎం, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ దారి పొడవునా నినాదాలు మారుమోగాయి. ముందుగా పైపుల రోడ్డు సెంటరులో అభ్యర్థి బాబూరావుకు సిపిఎం నాయకులు నెలకుదిటి తిలకం దిద్దగా, బాబూరావు సతీమణి సునంద పూలమాల వేసిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీ సాగిన దారి పొడవున ఎక్కడికక్కడ మజ్జిగ, మంచినీళ్లను పంపిణీ చేశారు. పలువురు మహిళలు ర్యాలీకి ఎదురేగి బాబూరావుకు పూలమాలలు వేసి, హారతులు పట్టారు. ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పైపుల రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్, డాబాకొట్లు సెంటర్‌లో మెడికల్ రిప్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణయ్య నేతృత్వంలో పలువురు ఉద్యోగులు ర్యాలీకి స్వాగతం పలికారు. ముత్యాలంపాడు సెంటర్‌లో ఆ ప్రాంత పార్టీ శాఖ కార్యదర్శి జి నాగరాజు, సీనియర్ నాయకులు మోతి నేతృత్వంలో ర్యాలీకి స్వాగతం పలికి, మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేశారు. సత్యనారాయణపురం పెట్రోల్‌బంక్ సెంటర్‌లో పార్టీ నాయకులు , ఊర్వసి థియోటర్ సెంటర్‌లో స్థానిక నాయకులు ర్యాలీకి స్వాగతం పలికారు. దారి పొడవునా స్వాగతాలు, అభినందనలు తెలుపుతూ గాలిలోకి బెలూన్లను వదిలారు. ర్యాలీకి ముందుగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకర పద్మశ్రీ, నరహరిశెట్టి నరసింహారావు, వి.గురునాథం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు హరినాథ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పరమేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, ఆండ్ర మల్యాద్రి, సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, పి.వి.ఆంజనేయులు, కోటా కళ్యాణ్, నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కమల, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, పి.కృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు బయ్యపురెడ్డి వెంకటేశ్వరరావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ నాయకులు గోళ్ల నారాయణరావు, సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కెవి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు నామినేషన్

హాస్పిటల్, చిట్టినగర్, తమ్మిన పోతరాజు రోడ్(కేటీ రోడ్), నెహ్రూ బొమ్మ సెంటర్, రథం సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్ వరకూ సాగింది. ర్యాలీలో పాల్గొన్న నాయకులపై ఎర్రపూల వర్షం కురిపించి తమ మద్దతును తెలిపారు. ఈర్యాలీ ఇటు కమ్యూనిస్టు పార్టీ శ్రేణుల్లో, అటు ఇండియా కూటమి పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాం నింపింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, అభ్యర్థి జి.కోటేశ్వరరావు, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అభ్యర్థి జి.కోటేశ్వరరావు పశ్చిమ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్మయికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

## పక్షపాతం లేకుండా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ

తావులేని వాతావరణంలో పనిచేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి నేతత్వంలో మంచి బందం జిల్లాలో పనిచేస్తోందని, ఇందుకు అభినందనలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రలోభాలకు తావులేకుండా జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు బందం స్ఫూర్తితో, నిబద్ధతతో పనిచేయాలని వి.జస్టిన్ సూచించారు. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలను పీపీటీ ద్వారా వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 16,99,350 మంది ఓటర్లు ఉన్నారని, అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టులు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్‌ఎంఎస్)ను పటిష్టంగా అమలుచేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.3.21 కోట్ల నగదుతో సహా మొత్తం రూ.6.45 కోట్ల మేర సీజర్లు జరిగినట్లు వివరించారు. అదేవిధంగా డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్, ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, పోలీస్, సెబ్, ఐటీ తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యకలాపాలను కలెక్టర్ డిల్లీరావు వివరించారు. జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, సౌరభ్ శర్మ, మదన్ కుమార్.. కలెక్టర్ డిల్లీరావుతో కలిసి కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లోని సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్, ఈఎస్‌ఎంఎస్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా సెల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి.. మార్గనిర్దేశనం చేశారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు తదితరులతో పాటు విజయవాడ ఆర్‌డీవో, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌వో ఇ.కిరణ్మయి, తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**IA. 06/2024 in HMOP 51/2022**

Between:-
కారం శైలజ ... పిటిషనర్/రెస్పాండెంట్
మరియు
కారం జానకి రామయ్య .... రెస్పాండెంట్/పిటిషనర్

పై నెంబరు IA : 6/2024 in H.M.O.P. 51/2022 లో రెస్పాండెంట్/పిటిషనర్ అయిన మీకు ఏన్ని పర్యాయములు నోటీసులు పంపిన మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల తో పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని ఆర్డర్ యిచ్చి యున్నారు. అందుకుగాను రెస్పాండెంట్/ పిటిషనర్ అయిన మీరు పై నెంబరు IA: 6/2024లో హాజరు అగుటకు ది. 26.4.2024వ తేదీన వాయిదా అయి ఉన్నది. సదరు మీరు స్వయంగా గాని, మీ తరుపున న్యాయవాది ద్వారా కాని హాజరు అయి మీ య్యొక్క అభియ్యోగములు తెలియపర్చగలరు. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించెదరు.

( శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల తో)
వాయిదా తేది :26.4.2024.

**పిటిషనర్/రెస్పాండెంట్ తరపు న్యాయవాదులు**
**వేల్పుల స్వామి,**
నందిగామ **మంగళ్ళపూడి ముక్తేశ్వరరావు(సన్నీ),**
ది.12.4.2024 **నందిగామ సెల్. 9290501750.**

**మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో**

**I.A. No.48/2023 in O.S. No.166/2009**

బిట్వీన్ :
ఆవుల శ్రీనివాస్ .... పిటీషనర్ / 5వ డిఫెండెంట్
మరియు
సుంకర ఆంజనేయులు అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్
**టు,**
**రెస్పాండెంట్స్ / డిఫెండెంట్స్ 2 & 4**
**R2/D2 :** నాళం రమేష్ తండ్రి : వెంకటరాజు, డోర్ నెం.11-25-345, ఓల్డ్‌సిటీ, విజయవాడ.
**R4/D4 :** సత్యవరపు రాధాకుమారి భర్త : కృష్ణమూర్తి, డోర్ ణెం. 6/433-2, ఖాజ్జిల్లిపేట, మచిలీపట్నం.

పై నెంబరు I.A. No.48/2023 in O.S. No.166/2009 లో రెస్పాండెంట్స్ / డిఫెండెంట్స్ 2 మరియు 4 అయిన మీ హాజరు నిమిత్తం ది. 26-4-2024 నకు వాయిదా అయివ్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 26-4-2024

మచిలీపట్నం. **ఎస్.ఎస్.ఎస్.సాయిబాబు**
ది.19-4-2024. **న్యాయవాది, మచిలీపట్నం.**

# ప్రజల్ని ఆలోచింపజేసేలా కళారూపాలు

శిక్షణ పొందుతున్న కళాకారులు

**ప్రజాశక్తి-గన్నవరం:** జనం గుండె చప్పుడు సిపిఎం జెండారా.. సుత్తి, కొడవలి, చుక్క గుర్తు మనదిరా..దానికి ఓట్లు వేసి గెలిపించాలిరా.. అంటూ సాగిన పాటకు ప్రజానాట్య మండలి కళాకారులు చిందులు వేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేసే ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిస్తూ.. కళాకారులు గొంతెత్తి పాట పాడారు. శుక్రవారం గన్నవరంలోని అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో ప్రజా నాట్యమండలి పాటలు, నాటికల, డాన్స్ శిక్షణా శిబిరం జరిగింది. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు సంపన్నులకు, ప్రజాస్వామ్యవాదులకు మధ్య సాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఓట్లు దండుకోవడానికి డబ్బు సంచులతో గ్రామాల్లోకి వస్తున్న పరిస్థితి ఉందన్నారు. అయితే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న ఎర్రజెండా ప్రాధాన్యతను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ శిబిరంలో సామాజిక చైతన్యం కలిగించడంతో పాటు ప్రజలను ఆలోచింపచేసే విధంగా కళారూపాలు, పాటల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విస్తృత ప్రచార కార్యక్రమంలో కళాకారులు పాల్గొంటారని వివరించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాసిం మాట్లాడుతూ ప్రజలను పాటలు, కళారూపాల ద్వారా ఆలోచింపజేసి నీతివంతమైన రాజకీయాలు చేసే వ్యక్తులకు ఓటు వేసే విధంగా సిద్ధం చేస్తామన్నారు. 20 మంది కళాకారులు ఈ ప్రచార కార్యక్రమంలో హాజరై కళారూపాలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు విజయం కోసం పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కొండబాబు, నాయకులు కవి, నాగరాజు, సాంబా, సుజాత, పేతురు పాల్గొన్నారు.

## 'మైత్రి' సాయం

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** మచిలీపట్నం మండలం తాళ్లపాలెం పంచాయితీ సజ్జలవారిపాలెం గ్రామానికి చెందిన శీలం లక్ష్మి పార్వతి కుటుంబానికి మైత్రీ ఫౌండేషన్ అండగా నిలబడింది. లక్ష్మీ పార్వతి భర్త గ్రామ విఆర్ఎగా పనిచేస్తూ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మరణించారు.వారికి ముగ్గురు పిల్లలు ప్రస్తుతం ఆ కుటుంబానికి ఎటువంటి ఆధారం లేక ఇల్లు గడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని స్థానికుల ద్వారా తెలుసుకున్న మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఆ కుటుంబానికి రెండునెలలకు సరిపడా బియ్యం మరియు నిత్యావసర వస్తువులు, రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు కె వేణు కుమార్, సభ్యులు రామకష్ణ మాస్టారు, రిలాక్స్ ప్రసాద్, వక్కంటి రమాదేవి, రహీమ్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుడ్లవల్లేరులో వైసిపి ప్రచారం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** వైసిపి గుడివాడ నియోజకవర్గ అభ్యర్థి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) మండలంలో నేటి నుండి ఎన్నిక ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ శాయన రవికుమార్ తెలిపారు. 20వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుండి మండల కేంద్రమైన గుడ్లవల్లేరు అంబేద్కర్ నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## 'ఎన్నికల విధుల్లో వికలాంగులను మినహాయించాలి'

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ఎన్నికల విధుల నుండి వికలాంగ ఉద్యోగస్తులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వికలాంగుల మరియు వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.కామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కమీషన్ ఉత్తర్వుల ప్రకారం వికలాంగ ఉద్యోగస్తులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఉందని ఈ ఉత్తర్వులను కాదని కొంత మంది వికలాంగ ఉద్యోగస్తులకు ఎన్నికల డ్యూటీలు వేస్తున్నారని పెనమలూరు, మచిలీపట్నం ఇలా అనేక ప్రాంతాల్లో వికలాంగులకు ఎన్నికల డ్యూటీలు వేసారన్నారు. దీని వలన వికలాంగ ఉద్యోగస్తులకు శారీరక, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం వికలాంగ ఉద్యోగస్తులకు

ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జన్ను లక్ష్మణ్, ఎన్ఎస్ నారాయణ, సభ్యులు ఎం.నాగబాబు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నియామక పత్రాలు

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన అభ్యర్థులకు భాష్యం విద్యాసంస్థలు నియామక పత్రాలు అందచేశారు. ఇటీవల భాష్యం విద్యాసంస్థల వారు కృష్ణా విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొంభై మూడు మందికి శుక్రవారం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం సాధించి బయటకు వెళుతుండడం గొప్ప అనుభూతి నిస్తుందన్నారు. ఉద్యోగంలో సంతప్తి సాధించాలి అంటే కష్టపడి పనిచేయాలన్నారు.జువాలజీ విద్యార్థులు ఇరవై మందికి, బొటనీ విద్యార్థులు పదిహేను మందికి, రసాయన శాస్త్ర విద్యార్థులు ఏభై మూడు మందికి, గణిత శాస్త్ర విద్యార్థులు ఏడుగురికి నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త డా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రహీనుడు పేర్ని : కొల్లు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

ఎంతో చరిత్ర కలిగిన మచిలీపట్నాన్ని పేర్ని నాని అతని కుమారుడు కృష్ణమూర్తి అరాచకాలకు అడ్డాగా మార్చారని, మచిలీపట్నం చరిత్రలోనే పేర్ని నాని ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మచిలీపట్నంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రజాగళం సభ విజయవంతం అవడంతో పేర్ని నానికి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల గురించి మాట్లాడే అర్హత పేర్నికి లేదన్నారు. తండ్రీ కొడుకులిద్దరూ బందరును ఒక గంజాయి కేంద్రంగా మార్చారన్నారు. జనసేన నేతకు చెందిన బార్‌పై దాడి చేసింది వాస్తవం కాదా పేర్ని నాని అతని కుమారుడు సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జనసేనా నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, గడ్డం రాజు పాల్గొన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతులచ్చన్న

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇంఛార్జి బండి రామకృష్ణ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 18వ వర్ధంతి సందర్భంగా టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గౌతులచ్చన్న బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి.బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉయ్యూరు:** నమ్మిన సిద్ధాంతానికి కడదాక కట్టుబడిని నిస్వార్థ ప్రజాసేవకుడు, త్యాగశీలి సర్దార్ గౌతులచ్చన్న అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి వెంకటబాబూ రాజేంద్రప్రసాద్ కీర్తించారు. గౌతులచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో శుక్రవారం లచ్చన్న 18వ వర్ధంతి నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి రాజేంద్రప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సగర సంఘ రాష్ట్ర కన్వీనర్ జంపన శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, మైనారిటీ సెల్ కార్యదర్శి అజ్మతుల్లా, వీరంకి శివాజి, పామర్తి శివ, నర్రా శ్రీనివా సరావు, పరశురామయ్య, జంపాన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గౌతులచ్చన్నకు నివాళులర్పిస్తున్న టిడిపి, జనసేన నాయకులు



## కెయు కార్మికులకు వేతనాలు అమలు చేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** కృష్ణా యూనివర్సిటీలో పనిచేస్తున్న డైలీ వేజ్ ఉద్యోగులను స్కిల్డ్ (డిగ్రీ, డిప్లొమో ఆపైన ) సెమిస్కిల్డ్ (ఇంటర్, ఐటిఐ) అన్ స్కిల్డ్ వర్కర్స్‌గా వర్గీకరించి వేతనాలు అమలు చేయాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కృష్ణా యూనివర్సిటీ పరిపాలనాధికారులైన ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబులకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీలో పనిచేస్తున్న డైలీ వేజ్ ఉద్యోగులకు రాష్ట్రంలో ఉన్న ఇతర యూనివర్సిటీలో అమలవుతున్న ప్రకారం సంవత్సరానికి 12 క్యాజువల్ లీవులు, నెల మొత్తానికి జీతం, ఈఎస్ఐ, ఇపిఎఫ్ వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డైలీ వేజ్ ఉద్యోగుల కష్ణా యూనివర్సిటీ కమిటీ గౌరవ అధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బి. శ్రీరామ్ ప్రసాద్, జనరల్ సెక్రెటరీ జి వీరబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, పి జ్యోతి, జాయింట్ సెక్రెటరీ వి శ్రీనివాస్, ట్రెజరర్ కె రవికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బి శ్రీనివాసరావు,కె నాగేశ్వరరావు, వి.సాయి రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, పట్టణ అధ్యక్షులు ఎంఎ బెనర్జీ, శరత్ కుమార్, పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ మద్దతు తెలిపారు.

**నూతన కమిటీ**

ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కృష్ణా యూనివర్సిటీ కమిటీ (డైలీ వేజ్ ఉద్యోగుల) సమావేశం అనంతరం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు పి.రవీంద్ర కుమార్, ఉపాధ్యక్షులు బి శ్రీరాం ప్రసాద్, జనరల్ సెక్రెటరీ జి.వీరబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.జ్యోతి, జాయింట్ సెక్రెటరీ వి.శ్రీనివాస్, కోశాధికారి కె రవికుమార్, యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో పది మందిని ఎన్నుకున్నారు.

## ఆదర్శనీయులు పాల్ హరిస్

**ప్రజాశక్తి-గన్నవరం:** ప్రపంచానికి ఆదర్శనీయులు పాల్ హరీస్ అని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్ కుమార్, కార్యదర్శి నర్ర సీతారామారావు అన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు పాల్ పి. హరిస్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం చిన

అవుటపల్లి పుణ్యాచారిటిష్ వృద్ధాశ్రమం వద్ద 93 మంది వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయంటే దానికి హరిస్ కారణమన్నారు. ఆయన స్ఫూర్తి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటియన్లు గన్నే వెంకట్రావు, టిఎస్‌ఆర్‌కె ప్రసాద్, జి రవిబాబు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో (మెయిన్) లో 187 నూతన ఉమెన్ పోలింగ్ స్టేషను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నట్లు తాసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలింగ్ స్టేషను

పరిశీలించి తగుచూచనలు సలహాలను అధికారులకు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, మండల సర్వేయర్ రామకష్ణ, ఆర్ఐ షకీలా బేగం, వీఆర్వో యస్. ప్రకాష్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.




ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శనివారం
20 ఏప్రిల్ 2024


## వైసిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్:** మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ శుక్రవారం మచిలీపట్నం పార్లమెంట్ వైసిపి కార్యాలయాన్ని, ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని), వైసిపి అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు మంచి పరిపాలన అందించారని ఆయన ప్రవేశపెట్టిన పథకాలు పేద ప్రజలకు ఉపయోగపడ్డాయన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

## 'ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి'

**ప్రజాశక్తి-చల్లపల్లి:** ఇండియా వేదిక అభ్యర్థి అందే శ్రీరామ్మూర్తి విజయానికి కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో అవనిగడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందే శ్రీరామమూర్తి విజయాన్ని కాంక్షిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మధు మాట్లాడుతూ ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించాలన్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి అందే శ్రీరామమూర్తి, సిపిఎం నాయకులు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు, బండి ఆదిశేషు, కొప్పునాతి తాతయ్య, అవనిగడ్డ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిడ్ల వీర రాఘవులు, గోళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



## కవి గళం

### అవిగో ఎన్నికలు

వస్తున్నాయి వస్తున్నాయి
అదిగదిగో వస్తున్నాయి
ఎందరో నాయకుల తలరాతలు మార్చగ
ఈ దేశభవితకు కొత్తఊపిరి పోయగ
వస్తున్నాయి ఎన్నికలొచ్చేస్తున్నాయ్
ప్రజల కోసం ప్రజల చేత
ఎన్నుకోబడిన ప్రజాస్వామ్య దేశంలో
నైతిక విలువలకు పట్టంకడతాం
నిబద్ధతతో పని చేస్తాం
అని.. మాటల గారడీ చేస్తూ
అరచేతిలో స్వర్గం చూపిస్తూ
రంగులు మార్చే నాయకుల
ఆశలకు ఊపిరిపోస్తూ
వస్తున్నాయి ఎన్నికలొచ్చేస్తున్నాయ్
ప్రజాస్వామ్యానికి
తూట్లు పొడుస్తున్నవారిని
ఏమీ చేయలేక చేతకాక
మౌనంగా ఉండలేక
గట్టిగా మాట్లాడలేక
సతమతమవుతున్న
ఎందరో ఎందరెందరో
విద్యాసాహితీ సామాజిక వేత్తల
ఉదాసీనతకు సాక్షిగా
వచ్చేస్తున్నాయి... కానీ
నైతికత నిబద్ధతతో ఉండే నేతలారా
చేతులారా అవకాశం
పాడుచేసుకోకండి
ఇదే తరుణం ఇదే అవకాశం
అని భావించి ముందుకు రండి
ఓటు అనే హక్కుతో
దేశ రక్షణ అనే బాధ్యతతో
మంచిని గెలిపించుకునేందుకు
నీతిని సంరక్షించుకొనేందుకు
ముందుకు రండి
ధనాశకు లొంగిపోయిన
వారికి ఉపదేశించండి
అప్పుడే ప్రజాస్వామ్యం నిలుస్తుంది
దేశ భవిత.. అదే...
మన భవిత బాగుపడుతుంది.

**- పంతుల వెంకటేశ్వరరావు**

# ప్రచార కూలీలు వచ్చేశారహో..!!

## • షిఫ్ట్‌ల వారీగా బృందాలు • ఓటర్లే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి**

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభంకావడంతో రాజకీయ వేడి పెరిగింది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. భారీ సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి గద్దెనెక్కాలనే ధోరణులు పెరిగిపోతున్నాయి. ఆర్థిక స్తోమతను ప్రామాణికంగా తీసుకుని మాత్రమే ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొందరు ఓట్లకు నోట్లు పంపిణీ చేయడం రివాజుగా మారింది. ఇలా ప్రతీదీ ఆర్థిక అంశంగా మార్చిన ప్రధాన రాజకీయ పార్టీలు నిర్వహించే సభలకు స్వచ్ఛందంగా వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆయా పార్టీల అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలకు, ప్రచార సభలకు జనసమీకరణ కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. ఇందుకోసం వైసిపి, టిడిపి అభ్యర్థులు భారీగా వ్యయం చేస్తున్నారు. పేదలను పలు రకాల ప్రలోభాలకు గురిచేస్తూ ఎన్నికల ప్రచారానికి ఉపయోగింటున్నారు. ఈ వ్యవహారంలో మధ్య దళారులకు పంట పండుతోంది. సిమెంట్ పని, ఇతర కూలీ నాలీ చేసుకునే పేదలను కిరాయికి మాట్లాడుకొని షిఫ్ట్‌ల వారీగా ఎన్నికల ప్రచారానికి తిప్పుకుంటున్నారు. రెక్కలకష్టంపై ఆధారపడి జీవించే వారిని ఏదోఒక రకంగా మాయోపాయాలకు, పలు రకరకాల ప్రలోభాలకు గురిచేస్తూ ప్రచారాలకు వాడుకుంటున్నారు. కోట్లాది రూపాయలు కుమ్మరించి, ఎలాగైనా గెలుపొందాలనే తాపత్రయంతో ప్రచారంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. నామినేషన్ల పర్వం ప్రారంభంకావడంతో ప్రచార ఉధృతిని పెంచారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పనులు కూడా అంతంత మాత్రంగా ఉండటం, ప్రత్యామ్నాయం ఆదాయ వనరులు లేకపోవడంతో చేసేది లేక కొందరు మహిళలు చంటిబిడ్డలను సైతం చంకనేసుకొని ఎండలో ప్రచారానికి వెళుతున్నారు. వయసు పైబడిన వృద్ధులు సైతం ఎంతో కొంత వస్తుందనే ఆశతో వెళుతున్నారు. ప్రచారానికి ఎక్కువగా మహిళలను వినియోగిస్తున్నారు. పార్టీ గుర్తులు గల చీరలు పంపిణీ చేసి, ప్రతి మహిళకు రూ.300 వరకు ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకుని తీసుకెళుతున్నారు. మధ్యవర్తులుగా ఉండే కొందరు తమకు ఇచ్చే డబ్బుల్లో ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ.100 నుంచి రూ.150 వరకు మిగుల్చుకుని మిగిలిన డబ్బును ఇస్తారని ప్రచారానికి వెళుతున్న పలువురు మహిళలు చెబుతున్నారు. ఉదయం ఒక షిఫ్ట్‌గా, సాయంత్రం మరో షిఫ్ట్‌గా ప్రచారం సాగిస్తున్నారు. ఇటీవల వైసిపి ఆధ్వర్యంలో గుడివాడలో సిఎం జగన్మోహనరెడ్డి 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించారు. ఈసభకు ప్రజలను సమీకరించడానికి వందలాది ఆర్టీసీ బస్సులను నేతలు ఏర్పాటు చేశారు. బిజెపి, టిడిపి, జనసేన కూటమి పార్టీలు సైతం పామర్రు, పెనమలూరు, పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజాగళం సభలు నిర్వహించాయి. ఈ సభలకు ప్రజా సమీకరణకు అష్టకష్టాలు పడ్డారు. కొందరు అభ్యర్థులు కుటుంబ సభ్యులు, బంధుగణాన్ని గ్రామగ్రామానికీ పంపి రోజువారీ ఆయా గ్రామల్లో ఒకటికి రెండుసార్లు డోర్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆహారం, కూల్ డ్రింక్‌లు, ఏసీ కారులు, ఇంటింటికీ తిరగడానికి ఆయా గ్రామాల్లో ఉన్న వారిని సమీకరించేందుకు పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పార్లమెంట్ అభ్యర్థి ఎన్నికల్లో ప్రచారానికి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల మాత్రమే వ్యయం చేయాలి. అయితే దీనికి ఎన్నో రెట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. సభకు వాహనాలను సమకూర్చడంతోపాటు సభకు వచ్చేవారికి ఒక్కొక్కరికి రూ.300 , బిర్యానీ, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం సర్వసాధారణంగా మారిపోయింది. స్థానిక ప్రచారంలోనూ మార్పులు వచ్చాయి. డిజిటల్ స్క్రీన్లకు భారీగా వ్యయం చేస్తున్నారు. పోలింగ్‌కు ముందు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పంచే డబ్బులు దీనికి అదనం. ఇలా ఎన్నికలు ధనస్వామ్యంగా మారడంతో రానురాను సామాన్యులు పోటీచేసే అవకాశమే లేకుండా పోతోందని పలువురు ప్రజాస్వామ్య వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా వ్యతిరేకులను తిరస్కరించండి

### 'ఇండియా వేదిక' సమావేశంలో వక్తలు

**ప్రజాశక్తి-పెదపారుపూడి:** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న వారిని ఈ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించాలని పలువురు వక్తలు అన్నారు. ఇండియా వేదిక బలపరిచిన పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డివై దాస్ విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక లయన్స్ క్లబ్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇండియా వేదికకు అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. రాజకీయాల్లో అరుదైన నాయకుడిగా పేరొందిన డివై దాస్ పామర్రులో తిరుగులేని నేతగా గుర్తింపు పొందారన్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ధనేకుల మురళి మాట్లాడుతూ దేశ రక్షణ కోసమే ఇండియా వేదిక ఏర్పాటైందన్నారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిజెపికి, దానికి మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించాలని అనా నరు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శివనాగేంద్రం మాట్లాడుతూ పదేళ్ల బిజెపి పాలనలో కార్పొరేట్లు మాత్రమే అభివృద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి డివై దాసు, సిపిఐ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరావు, బి నాయక్, తాడిశెట్టి సాంబశివరావు, హైదర్, కొడాలి బసవమ్మ, శనగల బ్రహ్మయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహిద్దాం

**ప్రజాశక్తి- హెల్త్ యూనివర్శిటీ :** మే 13న జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించడం ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి జిల్లా యంత్రాంగాన్ని మంచి పేరు తీసుకువద్దామని ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులతో శుక్రవారం గాంధీనగర్‌లోని ఏపి ఎన్జీఓ హోంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందిగా ఉత్తర్వులు జారీకాబడిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఫారం 12 పత్రాన్ని ఇవ్వడం జరిగిందని, ఈ పత్రాన్ని తమ నిర్దేశిత రిటర్నింగ్ అధికారికి నిర్దేశిత సమయంలోపు ఉద్యోగులు ఇవ్వాల్సి ఉందని కోరారు. ఈ సందర్భంగా ఏదైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే సంఘం దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సారి ఉద్యోగులకు చేతికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వరనీ, వాటిని మే 5, 6 తేదీల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారి నిర్దేశించిన ఫెసిలిటేషన్ సెంటర్లో అప్పటికప్పుడు జారీ చేయబడిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవలసిన పరిస్థితి ఉందని, దీనిని అందరూ గుర్తించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ శాఖల ఉద్యోగుల ప్రతినిధులు పి.రమేష్, బి.సతీష్ కుమార్ బి.వి.రమణ, ఎమ్.మధుసూదనరావు, ఎస్.కె నజీరుద్దీన్, సివిఆర్ ప్రసాద్, పి.శ్రీనివాసరావు, కె.శివ శంకర్, కెవి నారాయణరావు, సిహెచ్ రాధాకష్ణ, డి. విశ్వనాధ్ మహిళా ఉద్యోగుల ప్రతినిధి కె. శివలీల తదితరులతో సహా వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ విద్యాసాగర్

# హామీలు అమలు చేయని వారిని ప్రశ్నించండి

## సిపిఎం గన్నవరం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్:** రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిధులు, పోలవరం ప్రాజెక్టుకు నిధులివ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వారు ఓట్లు అడగడానికి వస్తే ప్రశ్నించాలని ఇండియా వేదిక బలపరిచిన గన్నవరం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించబడాలంటే రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పదేళ్లిస్తామని తిరుపతిలో ప్రకటించిన బిజెపి అనంతరం ప్రజలను నట్టేటా ముంచిందని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగాన్ని కాపాడుతుందని, పేదల సంక్షేమ బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, కార్పొరేటర్లకు దేశ సంపదను దోచిపెడుతోందని అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల్లో విభజన తెస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపిని, దానితో జత కట్టిన పార్టీలను, తొత్తుగా వ్యవహరించే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో అభివృద్ధి జరగలేదని ఇసుక రేటు విపరీతంగా పెరిగిపోవడం వల్ల భవన నిర్మాణాలు ఆగిపోయి కార్మికులకు పనులు లేకుండా పోయాయని చెప్పారు. ఈ సమస్య వైసిపి, టిడిపిలకు పట్టలేదన్నారు. ఈ ఎన్నికల్లో తమకు ఓట్లు వేయాలని వచ్చిన వారిని ప్రజలు ప్రశ్నించాలని ఆయన పేర్కొన్నారు. జరగబోయే ఎన్నికలలో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి కోరం రవి, మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, నాయకులు సాంబశివరావు, శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, కొవ్వూరు రైతు సంఘం నాయకులు పంచకర్ల రంగారావు, ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, రాష్ట్ర మత్స్య కార్మిక సంఘ కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్, సిఐటియు ఉపాధ్యక్షులు మర్రాపు పోలినాయుడు పాల్గొన్నారు.

కొత్తపల్లి గ్రామంలో ఓట్లు అభ్యర్థిస్తున్న కళ్లం వెంకటేశ్వరరావు

గన్నవరంలో ప్రచారం

### గన్నవరంలో సిపిఎం ప్రచారం

**ప్రజాశక్తి-గన్నవరం:** నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చే ఎర్రజెండా అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావుకు ఓటు వేయాలని కోరుతూ శుక్రవారం గన్నవరంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వామ పక్ష నాయకులు మీరాఖాన్, పఠాన్ సర్దార్, మిరప నాగేశ్వరరావు, దాదా, ఉడత రామకష్ణ, విజయరావు, వెంకటేశ్వరరావు వియన్ పురంలో, గన్నవరంలో ఎన్. శ్రీనివాసరావు, మాదిరెడ్డి చిన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

# కృష్ణాలో రెండో రోజు 8 నామినేషన్లు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** కృష్ణాజిల్లాలో రెండో రోజు శుక్రవారం మొత్తం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున బడుగు క్రాంతి కుమార్ ఒక నామినేషన్ దాఖలు చేయగా, గుడివాడ అసెంబ్లీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలు చేయగా కాంగ్రెస్ పార్టీ నుండి వడ్డాది గోవింద్ రావు, బహుజన్ సమాజ్ పార్టీ నుండి గుడివాడ బోసు బాబు, అవనిగడ్డ అసెంబ్లీ ఇండిపెండెంట్ స్థానానికి నాదెళ్ళ గిరిధర్ నాయుడు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలాలు చేశారు. అలాగే పెనమలూరు అసెంబ్లీ స్థానానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయి. టిడిపి నుండి బోడే ప్రసాద్ రెండు సెట్లు, బోడే హేమ చౌదరి రెండు సెట్లు దాఖలు చేశారు.

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వడ్డాది గోవిందరావు

### కాంగ్రెస్ అభ్యర్థి వడ్డాది నామినేషన్

**ప్రజాశక్తి-గుడివాడ :** గుడివాడలో పోటీ చేసే అభ్యర్థుల్లో తానే స్థానికుడినని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వడ్డాది గోవిందరావు(రాజేష్) అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో సినియర్ నాయకులు శిష్ట్లా దత్తాత్రేయులు, వామపక్ష నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా వడ్డాది గోవిందరావు తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారిణి పద్మావతికి నామినేషన్ పత్రాలను అందజేసారు. తొలుత తన స్వగృహం నుండి వేలాది అభిమానులు తోడుగా ఎండ్ల బండిపై ర్యాలీగా ఆర్‌డిఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వడ్డాది శివకృష్ణ, జిల్లా మహిళా కార్యదర్శి దగాని నిశ్చల, కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కశిరెడ్డి సత్యవతి, వడ్డాది సునీత తదితరులు పాల్గొన్నారు. గుడివాడ నియోజకవర్గ అసెంబ్లీకి బహుజన్ సమాజ్‌పార్టీ అభ్యర్థి గుడివాడ బోసుబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి దేవరపల్లి దేవమణి, స్థానిక నాయకులు మరిమబాబు, దారం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కంకిపాడు:** పెనమలూరు నియోజకవర్గ జనసేన, బిజెపి బలపరిచిన టిడిపి అభ్యర్థిగా బోడే ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టిడిపి నాయకులు వంగవీటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ర్యాలీకి హాజరైన జన సందోహం

మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కృష్ణ

# కోలాహలంగా బాబూరావు నామినేషన్

కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ, ఆర్‌జెడి, ఇండియా వేదిక బలపరచిన సిపిఎం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. దీనికి ముందు అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డు సెంటరులో సభ జరిగింది. అనంతరం పైపుల రోడ్డు నుంచి భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ కృష్ణా హోటల్ సెంటర్, డాబాకొట్లు బజార్, ముత్యాలంపాడు, భగత్‌సింగ్ రోడ్డు, సత్యనారాయణపురం శివాజీ కేఫ్, ఊర్వసి సెంటర్ మీదుగా అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వరకు సాగింది. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, ఆర్‌జెడి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు ముఠా, ఆటో, హాకర్స్, బిల్డింగ్, ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు వేలాది మంది పాల్గొన్నారు. ఆయా పార్టీల జెండాలు, టోపీలు, ప్లకార్డులు చేబూని ర్యాలీలో ముందుకు సాగారు. ప్రత్యేక వాహనంలో అభ్యర్థి సిహెచ్.బాబూరావుతోపాటు ఆయా పార్టీల నేతలు, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజా సంఘాల నేతలు ఉన్నారు. ఈ ర్యాలీలో డప్పు కళాకారుల డప్పునృత్యాలు మారుమోగుతూ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిపిఎం జెండాలు రెపరెపలాడాయి. ఎండను సైతం లెక్క చేయకుండా శ్రేణులు ర్యాలీలో నడిచాయి. బాబురావు గెలుపు...మనందరి గెలుపు, సిపిఎం, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ దారి పొడవునా నినాదాలు మారుమోగాయి.

మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి, సిపిఎం నాయకులు కాశీనాథ్, ఆమ్‌ఆద్మీ నాయకులు పరమేశ్వరరావు

## వైసిపిని గెలిపించాలి : సామినేని

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** రానున్న ఎన్నికల్లో లంచాలు లేని ప్రభుత్వం కావాలంటే వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు అన్నారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేసిన అభివృద్ధిని తెలుపుతూ మరొకసారి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఎంపిగా కేశినేని నానిని, ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానుని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రచారంలో విమలాభాను

## పేదల సంక్షేమమే వైసిపి ఎజెండా

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పేదల సంక్షేమమే వైసిపి అజెండా అని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను అన్నారు. పట్టణంలోని బలుసు పాడు రోడ్డు క్రిస్టియన్ పేటలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేసిన అభివద్ధిని తెలుపుతూ రానున్న ఎన్నికల్లో మరొకసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ పేటలో ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో మరొకసారి ఎంపీ కేశినేని నానికి సామినేని ఉదయభానుకి అవకాశం ఇవ్వాలని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మల్లెల చిన్న వీరయ్య టిడిపిని వీడి వైసిపిలో కలిశారు. ఆయనను పార్టీ కండువా కప్పి సామినేని పార్టీలోకి ఆహ్వానించారు.

## 'స్వామి దాసును ఆదరించండి'

**ప్రజాశక్తి - గంపలగూడెం :** జరగనున్న ఎన్నికల్లో తిరువూరు వైసిపి అభ్యర్థి నల్లగట్ల స్వామి దాసును ఆదరిం చాలని, ఆయన సతీమణి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నల్లగట్ల సుధారాణి కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టౌన్ పరిధిలో ఉన్న పడమట దళితవాడలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా, సుధారాణి మహిళలతో మాట్లాడుతూ తాము 30 సంవత్సరాలుగా తిరువూరులోనే ఉంటూ అందరికీ తెలిసినవారమని చెప్పారు. స్వామి దాసును ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు. ఏ పరిస్థితుల్లోనైనా స్వామిదాసు అందుబాటులో లేకపోతే, తాను సైతం ఏ రకమైన పనినైనా అధికారులతో మాట్లాడి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లో వసతుల పరిశీలన

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఎమ్‌సిసిలో భాగంగా గురువారం, శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి 21 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో నాలుగు ఫ్యాన్లు నాలుగు ట్యూబులు టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్ మంచినీరు ర్యాంపు చుట్టూ ప్రహరీ లాంటి మౌలిక సదుపాయాలను పరిశీలిం చారు. అక్కడక్కడ చిన్నచిన్న సదుపాయాలను గుర్తించి వాటిని వెంటనే పూర్తి చేయాల్సిందిగా టి.ఎల్.ఎమ్, పిఎస్‌లని కోరారు. తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు, దాములూరు, చిలుకూరు, కాచవరం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

# రెండోరోజు పలువురు నామినేషన్లు దాఖలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఇండియా వేదిక బలపరిచిన సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు శుక్రవారం నామినేషన్ కార్యక్రమం ఆద్యంతం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కెఎల్.రావు పార్క్ వద్ద నుంచి భవానీపురంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు సాగిన ర్యాలీ ఉత్సాంగా సాగింది. ఎర్రచీరలు ధరించిన మహిళా కార్యకర్తలు, ఎర్రచొక్కాలు ధరించిన పురుష కార్యకర్తలు ఎర్రజెండాలు పట్టుకుని క్రమశిక్షణతో ముందు నడువగా... స్వచ్ఛందంగా తరలివచ్చిన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీని విజయవంతం చేశారు. కలరా హాస్పిటల్, చిట్టినగర్, తమ్మిన పోతరాజు రోడ్ (కేటీ రోడ్), నెహ్రూ బొమ్మ సెంటర్, రథం సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్ వరకూ సాగింది. ఈ ర్యాలీ ఇటు కమ్యూనిస్టు పార్టీ శ్రేణుల్లో.. అటు ఇండియా వేదిక పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాం నింపింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**వైసిపి అభ్యర్థి అసిఫ్ నామినేషన్**

వైసిపి పశ్చిమ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ పశ్చిమలోని రిట్నర్నింగ్ కార్యాలయంలో తన నామినేషన్‌ను శుక్రవారం దాఖలు చేశారు. ఈ సందర్భంగా పంజా సెంటర్ నుంచి

జగ్గయ్యపేటలో నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

భారీ ర్యాలీగా బయలుదేరారు. కేరళ డప్పు విన్యాసాలు, జానపద కళారూపాలు, తీన్‌మార్ సందడ్లు, పులివేషాలు,. డప్పుల విన్యాసాల మధ్య కోలాహలంగా ర్యాలీని నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, ఏపీ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, నాయకుడు పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలతో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించి ఆ తరువాత విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి పోటీ చేయాలని డిమాండ్ చేశారు.

**నలుగురు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు**

**ప్రజాశక్తి - భవానీపురం :** పశ్చిమ నియోజకవర్గం నుండి శాసన సభ్యత్వానికి పోటీలో ఉన్న నలుగురు అభ్యర్థులు శుక్రవారం తమ నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థిగా ఆసిఫ్ షేక్, సిపిఐ అభ్యర్థిగా జి.కోటేశ్వరరావు. ఎంసిపి(ఐ) అభ్యర్థిగా ఖాదర్ బాషా షేక్, స్వతంత్ర అభ్యర్థిగా రత్నావత్ కిషోర్ కుమార్ భవానీపురంలోని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఇ.కిరణ్మయికి తమ నామినేషన్లు దాఖలు చేశారు.

**జగ్గయ్యపేట :** శాసనసభ నియోజకవర్గానికి రెండో రోజు శుక్రవారం 2 నామినేషన్లు దాఖలైనట్లు జగ్గయ్యపేట రిటర్నింగ్ అధికారి అర్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి కర్నాటి అప్పారావు, టిడిపి నుండి శ్రీరామ్ రాజగోపాల్ తరపున కొత్త మాస మల్లికార్జునరావు నామినేషన్ దాఖలు చేశారు.

**మైలవరం :** మైలవరం నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వేములపల్లి పథ్వి, ఇబ్రహీంపట్నం ఏ కాలనీకి చెందిన వేల్పూరి కనకదుర్గాదేవి స్వతంత్ర అభ్యర్థులుగా తమ నామినేషన్లను దాఖలు చేశారు.

నామినేషన్ అందజేస్తున్న సిపిఐ అభ్యర్థి కోటేశ్వరరావు

నామినేషన్ అందజేస్తున్న వైసిపి అభ్యర్థి అసిఫ్

నామినేషన్ అందజేస్తున్న గద్దె అనురాధ

**విజయవాడ తూర్పులో మూడు నామినేషన్లు**

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు రెండో రోజు విజయవాడ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మూడు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో విజయవాడ తూర్పుకు సంబంధించి టిడిపి అభ్యర్థి గద్దె రామమోహన్, గద్దె అనూరాధ, గద్దె క్రాంతి కుమార్‌లు ఒకొక్క సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

# పలు పార్టీల అభ్యర్థుల ప్రచారం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** ఐక్య కార్యాచరణతో వైసిపి అభ్యర్థులను గెలిపించుకుందామని జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ గ్రామంలో వైసిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సభ్యులుగా సర్నాల తిరుపతిరావును, పార్లమెంటు సభ్యులుగా కేశినేని నానిని గెలించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలంకి సురేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు కొలుసు గంగాధర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాట్ల రామారావు పాల్గొన్నారు.

**చిన్ని, కొలికపూడికి మద్దతుగా ప్రచారం**

**గంపలగూడెం:** మండలంలోని సొబ్బాల గ్రామంలో ఎన్డీఏ కూటమి పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, తిరువూరు అసెంబ్లీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు గెలుపును కాంక్షిస్తూ, ప్రచారం నిర్వహించారు. గ్రామ నాయకులు కావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

**16వ డివిజన్‌లో దేవినేని అవినాష్ ప్రచారం**

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** శుక్రవారం సాయంత్రం కోటి నగర్, పోలీస్ కాలనీ ప్రాంతాల్లో వైసిపి నేతలు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధికా బహదూర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో దేవినేని అవినాష్ ప్రచారం

**వసంత కుమారుడి ప్రచారం**

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** శుక్రవారం సాయంత్రం కొత్త రెడ్డిగూడెంలో టిడిపి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ వసంత ధీమంత్ సాయి ప్రజలను కలిసి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, యువ నాయకులు బొమ్మిన కోటేశ్వరరావు, గ్రామ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి సభ్యులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - వత్సవాయి :** తాళ్లూరు, మాచినేని పాలెం, కాకరవాయి గ్రామాల్లో శుక్రవారం జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి ఎంఎల్ఏ అభ్యర్థి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రచారం నిర్వహించారు. తాతయ్య మాట్లాడుతూ 13న జరగనున్న ఎన్నికలలో ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ (చిన్ని)కి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఓట్లు అభ్యర్థించడానికి ఎన్.డి.ఏ కూటమికి మాత్రమే అర్హత ఉందని, వైసిపికి ఏ మాత్రం అర్హత లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క సిమెంట్ రోడ్డు కూడా వేయలేదన్నారు. తమ హయాంలో సిమెంట్ రోడ్లు, డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ సిస్టములు ఈ విధంగా ఎన్నో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. తాళ్లూరు, మాచినేని పాలెం కాకరవాయి గ్రామాలలో ప్రధాన సమస్యలు తాగునీరు, సైడ్ డ్రెయిన్లు, ఇళ్లస్థలాలు కావాలని ప్రజలు అభ్యర్థించారు. టిడిపి ప్రభుత్వం రాగానే ప్రజల సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల టిడిపి అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, తాళ్లూరు మాచినేనిపాలెం ఎంపిటిసి బొల్లా వెంకటేశ్వరరావు, కాకరవాయి గ్రామ సర్పంచ్ గుర్రం రామారావు వివిధ గ్రామాల టిడిపి, బిజెపి, జనసేన పార్టీల్లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

విజయవాడ 9వ డివిజన్‌లో గద్దె ప్రచారం

**9వ డివిజన్‌లో గద్దె రామ్మోహన్ పర్యటన**

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గద్దె రామమోహన్ శుక్రవారం సాయంత్రం 9వ డివిజన్ పటమటలంక రామాలయం వద్ద నుండి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి గురించి, నియోజకవర్గంలో తాను చేసిన పలు కార్యక్రమాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ఐదేళ్లలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని, మరలా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు.

వత్సవాయిలో శ్రీరాం ప్రచారం

# ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారాలు

కోడూరులో సింహాద్రి ప్రచారం

## అవనిగడ్డ వైసిపి అభ్యర్థి సింహాద్రి ప్రచారం

**ప్రజాశక్తి - కోడూరు :** గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు తగ్గట్టుగా పనిచేసిన తనను మరల అవనిగడ్డ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఓటు వేసి గెలిపించాలని అవనిగడ్డ వైసిపి అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం సాయంత్రం కోడూరులోని 2,3 వార్డులలో తనయుడు వికాస్ బాబు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో రమేష్ బాబు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ లో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న విధానాన్ని చూసి, ఎంతోమంది యువకులు ప్రతిరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.

**పెదపారుపూడి :** దోసపాడు గ్రామ శివార్ తమ్మలంపాడు గ్రామంలో బాపులపాడు మండలం మాజీ జెడ్పిటిసి కృష్ణా జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడిగా కైలే అనిల్ కుమార్‌ని, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యునిగా సింహాద్రి చంద్రశేఖర్నిని, గెలిపించాలని కోరారు.

## బాలశౌరి విజయం కోసం ప్రచారం

**ప్రజాశక్తి - అవనిగడ్డ :** జనసేన పార్టీ బందరు పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ జనసేన పార్టీ నాయకులు అవనిగడ్డ మండలంలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని తుంగలవారిపాలెం గ్రామంలో రెండో రోజు మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషబాబు గుడివాడ శివరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి బాలశౌరి బుద్ధ ప్రసాద్లకు విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు ఈ కార్యక్రమంలో తుంగలవారిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు చుండూరు రమేష్ టిడిపి గ్రామ పార్టీ కన్వీనర్ భోగి రెడ్డి బుజ్జి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.

## సొర్ల గొందిలో బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యుల ప్రచారం

**ప్రజాశక్తి - అవనిగడ్డ :** నాగాయలంక మండల పరిధిలోని సోర్ల గొంది గ్రామంలో బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. బుద్ధ ప్రసాద్ అల్లుడు శీలం అశ్విన్ కోడలు మండలి సాయి సుప్రియ టిడిపి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలసిల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత మత్స్యకార సంఘం నాయకులు బిజెపి నాయకురాలు భోగాది రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి గత తెలుగుదేశం ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేసిన పథకాలను వివరిస్తూ తిరిగారు.

## వర్ల కుమార్ రాజా ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి - పెదపారుపూడి :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్డీయే కూటమితో మాత్రమే సాకారమవుతుందని పామర్రు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. శుక్రవారం పెదపారుపూడి మండలం చిన్నపారుపూడి గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఉద్యోగాలు ఉపాధి కల్పించకుండా బటన్ నొక్కడే ప్రభుత్వ కర్తవ్యం అనేలా వ్యవహరించారని విమర్శించారు. సూపర సిక్స్ పథకాల గురించి వివరించారు.

## కూటమి అభ్యర్థి యార్లగడ్డ ప్రచారం

**ప్రజాశక్తి - గన్నవరం :** గన్నవరం నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. శుక్రవారం ఆయన విజయవాడ రూరల్ మండలం, రామవరప్పాడు గ్రామంలోని, హనుమాన్ నగర్, పి.యస్.ఆర్ కాలనీ, రైల్వేలైన్ కట్టల ప్రాంతాల్లో గడపగడపకు ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను కలసి వారి కష్టాలను తెలుసుకుంటూ, సూపర్ సిక్స్ పథకాల ద్వారా వారికి జరిగే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టి.డి.పి అద్యక్షులు గొడ్డళ్ళ చిన్న రామారావు, కొల్లా ఆనంద్, పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ పథకాలతో ప్రచారం

**ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్ :** రాష్ట్రంలో ఆరాచకపాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడి కూటమిని అధికారంలోకి తీసుకువస్తే చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకు ప్రజాగళం పేరుతో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలుమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూటమి అధికారంలోకి వస్తే అమలు చసే పథకాల ద్వారా ప్రజలకు అందే లబ్దిని ఆయన వివరిస్తూ సూపర్సాక్స్ పథకాలు, యార్లగడ్డ నియోజకవర్ల అభివద్ధికి చేపట్టిన కార్యాచరణ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గన్న వరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## బొమ్ములూరులో యర్రంశెట్టి ప్రచారం

**ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్ :** రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైసిపి విభజన విభాగ ఉపాధ్యక్షులు యర్రంశెట్టి రామాంజనేయులు అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరు కండ్రిక, గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజవర్గం వైసిపి ఎమ్మెల్యే, అభ్యర్థిగా పోటీ చేస్తున్న వల్లభనేని వంశీ తరపున ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తూ కకరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వంశీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## ఐటి ఉద్యోగాలు కల్పిస్తాం : యార్లగడ్డ

**ప్రజాశక్తి... గన్నవరం :** నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చేపట్టనున్న ప్రత్యేక చర్యలను వివరించారు. శుక్ర వారం సాయంత్రం ప్రసాదంపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్.వి.ఆర్ సెంటర్, సగర్లబజార్‌సో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి గ్రామాల్లోని వీధుల్లో పర్యటిస్తూ గన్నవరం నియోజవర్గ అభివృద్ధికి తాను చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు మల్లవల్లి, వేరేపనేని గూడెం పారిశ్రామికవాడలను అభివద్ధి చేస్తామని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : మండలి

**ప్రజాశక్తి - చల్లపల్లి :** అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మూడు పార్టీల గుర్తు గాజు గ్లాసు అనీ, పార్టీల నాయకులు, కార్యకర్తలు గాజుగ్లాసు గుర్తును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. చల్లపల్లి మండల టిడిపి, జనసేన, బీజేపీ పార్టీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం లంకతోట రోడ్డులో యువ పారిశ్రామికవేత్త గుత్తికొండ వంశీకష్ణ ప్రాంగణంలో గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో, పోలీసు కార్యాలయంలో స్వేచ్ఛగా పనులు చేయించుకునే పరిస్థితి ప్రజలకు నేడు ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చెబితేనే గానీ పనులు కాని స్థితి నెలకొందన్నారు. గుల్లలమోదలో రాకెట్ లాంచింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకారం అందించకుండా 30వేల కోట్లు నియోజకవర్గానికి రాకుండా చేశారని ప్రభుత్వంపై స్థానిక శాసనసభ్యులపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బాలశౌరితో కార్యకర్తలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

చల్లపల్లిలో మండలి ప్రచారం

## చిల్లకల్లులో 'బాబు ష్యూరిటీ'

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** మండలంలోని చిల్లకల్లు గ్రామంలో రాష్ట్ర టిడిపి పిలుపు మేరకు, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ టతాతయ్య ఆదేశాల మేరకు వేదాద్రి రోడ్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను క్యాలెండర్‌ను అందించారు.

## మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో గల గోల్డ్ షాప్ సెంటర్‌లో శ్రీ శ్రీ వెంకట సాయి జ్యూయలర్స్‌లో దాత ఇన్ఫర్మేషన్ టెక్నాలిజీవిభాగం అధ్యక్షులు డోగ్గుపర్తి సురేష్, మణి వివాహ మహోత్సవ సందర్భంగా వారి సహకారంతో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కొత్తమాసు రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ కె.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షురాలు వాసా నాగమణి, వాసవి కపుల్స్ క్లబ్ కార్యదర్శి దారా సూర్యాకళ్ల రాజా, జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, వాసవి క్లబ్ రీజన్ చైర్మన్ కె.కొండ, తదితరలు పాల్గొన్నారు.

## కేశినేని చిన్నికి మద్దతుగా ర్యాలీ

**ప్రజాశక్తి - నందిగామ :** టీమ్ నర్వనేని మురళి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో జరుగుతున్న విజయవాడ పార్లమెంట్ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్‌లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వ్యాపారవేత్త, కమ్మ సంఘం నాయకులు నర్వనేని మురళి మిత్ర బృందం పట్టణం నుండి 50 కార్లతో పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి అనంతరం విజయవాడ బయలుదేరారు. నామినేషన్ కార్యక్రమం విచ్చేసిన చిన్నికి మురళి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### చిన్ని దంపతులకు సత్కారం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విజయవాడ టిడిపి ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) వారి సతీమణి జానకిని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న శుక్రవారం వన్‌టౌన్‌లోని తన నివాసంలో సత్కరించారు.

## దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు

**ప్రజాశక్తి - తిరువూరు** వేసవిలో దోమ కాటుకు గురి కాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రేష్మా బేగం సూచించారు. శుక్రవారం తిరువూరు పట్టణంలోని 15వ వార్డు జన్మభూమి రోడ్డులో దోమల నిర్మూలనకు వైద్యారోగ్య శాఖ, నగర పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వార్డులోని మురుగు కాలవల్లో చెత్తాచెదారం తొలగించి దోమలకు ఆవాసంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయిల్ బాల్స్ ప్రయోగించారు. దోమల లార్వా ఎదగ కుండా ఆయిల్ బాల్స్ ఉపయోగపడతాయని వైద్యాధికారి తెలిపారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు ప్రబలే ప్రమా దం ఉందని, దోమ కాటుకు గురైతే డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. కొబ్బరి బొం డాలు, కుండీలు, పాత టైర్లు, నీటి తొట్టెలు, పాలిథిన్ కవర్లను నివాస ప్రాంతాల కు దూరంగా తీసుకెళ్లి పడేయాలని, వినియోగంలో లేని పాత్రలను బోర్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.రవి, ఆరోగ్య కార్యదర్శి పి. రమాదేవి, శానిటరీ కార్యదర్శి రవిదత్త నాయక్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు బంగారు గాజులు వితరణ

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆలయంలో శ్రీ అమ్మవారి అలంకరణ నిమిత్తం రాజేంద్ర నగర్, గుడివాడకు చెందిన కె.సింధూర 55 గ్రాములు బరువు గల నాలుగు బంగారు గాజులను ఆలయ ఇఒ కె.ఎస్.రామరావును శుక్రవారం కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

## స్వతంత్ర అభ్యర్థిగా నాదెండ్ల గిరిధర్ నాయుడు నామినేషన్

**ప్రజాశక్తి - అవనిగడ్డ :** అవనిగడ్డ నియోజకవర్గంలో మొట్టమొదటి స్వతంత్ర అభ్యర్థిగా అవనిగడ్డ ఆరో వార్డుకు చెందిన నాదెండ్ల గిరిధర్ నాయుడు శుక్రవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపహాస్యం అవుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థను సరైన మార్గంలో పెట్టాలంటే డబ్బు మద్యంతో సంబంధం లేని ఎన్నికలు జరగాలని అందుకు తనలాంటివారు పోటీ చేయడం ద్వారా ఓటర్లకు ఓ సందేశాన్ని ఇవ్వాలనే సంకల్పంతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్రహ్మణ్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనను ప్రతిపాదించిన వారు కూడా పాల్గొన్నారు.

## రామ్ తాతయ్య ప్రచార యాత్రలో నిరసన

**ప్రజాశక్తి - వత్సవాయి :** మండలంలోని తాళ్ళూరు గ్రామంలో శ్రీరామ్ తాతయ్య మొదలుపెట్టిన ప్రచార యాత్రలో తాళ్ళూరు గ్రామంలో బొల్లా రామకృష్ణపై ఇటీవల కాలంలో తాతయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బొల్లా తులశమ్మ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో సహా ప్రచార యాత్రకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో టిడిపి అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన రామకృష్ణను పార్టీలో ఉన్నా వెళ్లిపోయిన ఒరిగేదేమీ లేదంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఉదత స్థాయిలో ఉద్యమాన్ని చేపట్టారు. ఎన్నికల్లో బొల్లా రామకృష్ణ టిడిపి పోటీ చేస్తారా, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా? అనే అంశాలపై నియోజకవర్గంలో పలు అను మానాలున్నాయి.

## బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం

**ప్రజాశక్తి మైలవరం :** మైలవరం మండలానికి చెందిన టిడిపి బూత్ కమిటీ కన్వీనర్లు, టిడిపి నాయకులతో స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఉమ్మడి టిడిపి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక సమయంలో అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. శంఖారావం కార్యక్రమాన్ని వచ్చే వారం రోజుల్లో 100శాతం పూర్తి చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు.

## గడపగడపకూ ఎంఎల్ఎ జగన్మోహన్‌రావు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణంలో రైతు పేట, డివిఆర్ కాలనీ ఏరియాలో వైసిపి నాయకులతో కలిసి ప్రతి గడపకు తిరుగుతూ, ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎమ్మెల్యేగా తన ఐదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని తెలిపారు. ముఖ్యంగా గత నందిగామను – ప్రస్తుత నందిగామను పోల్చుకుంటే ఎంత అభివృద్ధి జరిగిందో స్పష్టంగా కనబడుతుందన్నారు.

## ప్రసాదం కౌంటర్ తనిఖీ

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవ స్థానం దుర్గగుడి కొండపైన గల ప్రసాదం కౌంట ర్‌ను ఆలయ కార్య నిర్వహణా ధికారి కె.ఎస్ రామారావు తనిఖీ నిర్వహించారు. శు క్రవారం ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు కొండపైన ఘాట్ రోడ్‌లోని పవిత్ర సారె కౌంటర్, ప్రసాదం కౌంటరు స్టాక్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. కౌంటరు సిబ్బందితో మాట్లాడి, స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కౌంటరును మెరుగ్గా నిర్వహించేందుకు అవసరమైన సూచనలిచ్చారు. ఈవో వెంట ఆలయ ఏఈవో ఎన్ రమేష్ ఉన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న సౌరబ్ శర్మ

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సౌరబ్ శర్మ అమ్మవారి ఆలయానికి విచ్చేయగా ఆలయ ఇఒ కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఇఒ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

## చైత్ర మాస బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై చైత్ర మాస బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీ శుక్రవారం నుండి 27వ తేదీ శుక్రవారం వరకు జరుగు దుర్గామల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవ కళ్యాణ మహోత్సవాలు జరుగ నున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఆలయ కార్య నిర్వహణాధికారి కె ఎస్ రామరావు సమక్షంలో ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు, ప్రధానార్చకులు, అర్చక సిబ్బందిచే గంగా దుర్గ మల్లేశ్వర స్వామి వార్లకు వధూవరులుగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణా ధికారి కె.ఎస్.రామరావు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు.

## చెరువు కట్టతవ్వి ఆక్రమణలు

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలం, కొత్త నాగులూరు సాయిల చెరువు కట్టను తవ్వి ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. చెరువు కట్టతవ్వి కట్టను బలహీన పరిస్తే చెరువు నిండి కట్ట తెగే ప్రమాదం ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్:** జమాఅతె ఇస్లామీ హింద్ హనుమాన్ జంక్షన్ శాఖ ఆద్వర్యంలో శు క్రవారం విజయవాడ రోడ్‌లో మినరల్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, ఎ.డి.ఎల్.జనార్ధన్ రిబ్బన్ కట్ చేసి మొదటిరోజు మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాతే ఇస్లాం హింద్ ఆధ్యర్యంలో గత 8 సంవత్సరాలుగా వేసవిలో నాణ్యతా ప్రమాణాలతో మంచినీరు చలివేంద్రం ఏర్పాటుచేసి బాటసారులకు మంచినీరు అందించటం అభినందనీయం అని అన్నారు.

# సహకార బ్యాంకులతోనే సుస్థిర అభివృద్ధి

గుడివాడ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర

**ప్రజాశక్తి - గుడివాడ :** సహకార బ్యాంకులతోనే దేశం ఆర్థికంగా సుస్థిర అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార అర్బన్, బ్యాంకు అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు, ది కాకినాడ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర అన్నారు. అక్కయ్యపాలెం కేంద్రంగా ఉన్న కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ గుడివాడ శాఖను చిట్టూరి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల వారికి ఉపయోగకరంగా సహకార బ్యాంకులు నడుస్తున్నాయని చెప్పారు. కోఆపరేటివ్ రంగంలో అధునాతన సాంకేతికపరంగా ఖాతాదారులకు కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. బ్యాంకు కౌంటర్లను ప్రారంభించిన గుడివాడ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ విన్నమనేని పూర్ణవీరయ్య మాట్లాడుతూ చిన్న మధ్య తరహా ప్రజల అవసరాలను తీర్చేందుకు కోఆపరేటివ్ బ్యాంకు చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది, టాక్స్ కన్సల్టెంట్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజల అవసరాలను తీర్చడంలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు వినూత్న సేవలందిస్తుందని, అటువంటి సేవలను గుడివాడ ప్రజలకు కూడా అందించేందుకు నూతన శాఖను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అప్కాటి మాజీ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ ఖాతాదారులకు అనుగుణంగా సత్వర సేవలను అందించేందుకు తమ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీరామకృష్ణ, ఎన్.ఎస్.ఆర్. ఆంజనేయులు, ముఖ్యకార్య నిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్ శాఖ మేనేజరు కృష్ణప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరో రోజు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యాధికారులతో పాటు నర్సులకు, సెక్యూరిటీ సిబ్బందికి ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం జుజ్జూరు రోడ్డులో గల ప్రైవేటు హాస్పిటల్‌లో డాక్టర్‌కు, నర్సులకు సిబ్బందికి హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అడ్మిషన్‌లో ఉన్న పేషెంట్లను అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బయటికి ఎలా తీసుకురావాలనే అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వాటి నివారణోపాయంలో భాగంగా కొన్ని ప్రదర్శనలు చేసి చూపించారు. తదుపరి అక్కడ వారికి కరపత్రాలు బ్రోచర్స్‌ను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 101కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్, ఆఫీసర్ టి. శ్రీనివాసరావు, బి.సంజయ్ వర్మ, జి.రాజశేఖర్, బి.శ్రీను, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, షేక్ సుభానీ, జి.జీవన్, శీలం శ్రీనివాస్, ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నందిగామ కేంద్ర అగ్నిమాపక అధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మదర్ థెరిసా హాస్పిటల్, కె.ఎమ్.ఆర్ స్వర హాస్పిటల్‌లో మార్క్ డ్రిల్ కార్యక్రమం అగ్నిమాపక సిబ్బంది నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు ఏ విధంగా నివారించాలో, గ్యాస్ లీక్ అయితే ఎలా నివారించాలో అవగాహన కల్పించారు. హాస్పిటల్లో భారీ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు పొగ గదిలో ఇరుక్కున్నప్పుడు పేషెంట్లను ఏ విధంగా బయటికి తేవాలో రెస్క్యూ ఆపరేషన్ డెమో ఫైర్ సిబ్బంది అధికారులు చేశారు. నందిగామ కేంద్ర అగ్నిమాపక అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ హాస్పిటల్‌లో ఏదైనా ఫైర్ సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వచ్చేవరకు ఎదురు చూడకుండా హాస్పటల్ సిబ్బంది హాస్పటల్లో ఉన్న ఎక్విప్మెంట్ ద్వారా అగ్ని ప్రమాదాన్ని ఏ విధంగా నివారించాలో మార్క్ డ్రిల్ ద్వారా హాస్పిటల్స్ సిబ్బందికి అవగాహన కల్పించమని ఆయన తెలిపారు. గహాల్లో గ్యాస్ లీక్ అయితే గ్యాస్ లీకేజ్‌ని ఏ విధంగా అరికట్టాలో కూడా వివరించామని పూర్ణచందద్రావు తెలిపారు.

## ఐఎంఎ హాలుకు పొట్లూరి గంగాధరరావు పేరు

**ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ పట్టణంలో ఐఎంఏ హాలును అన్ని హంగులతో నూతనంగా నిర్మించి పొట్లూరి గంగాధరరావు ఐఎంఏ హాలుగా నామకరణం చేశారు. పట్టణానికి తలమానికంగా ఉన్న ఐఎంఏ హాలును పట్టణ ప్రజలకు వేడుకలకు కూడా ఇవ్వటానికి ముందుకు తీసుకొచ్చారని, సర్వాంగ సుందరంగా ఉన్న ఐఎంఏ హాలుకు డాక్టర్ పొట్లూరి గంగాధరరావు ఐఎంఏ హాలుగా నామకరణం చేయడానికి సహకరించిన ఆయన కుమారుడు డాక్టర్ పొట్లూరి వంశీకష్ణ అభినందనీయులు అని గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ (పెంప) రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ నందూరు ఉమాశంకర్ అన్నారు. ఇప్పటికే పలు వేడుకలు జరిగిన ఐఎంఏ హాల్లో మొట్టమొద ఆర్ఎంపి వైద్యులకు సమావేశానికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు కోలా వెంకటేశ్వరరావు, ఆర్.ఎం.పి గుడివాడ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు, మేడూరి రమేష్ బాబు, సంఘ ఉపాధ్యక్షులు గుదే నాగ చంద్రశేఖర్, ఏరియా సభ్యులు ప్రదీప్ కుమార్, పంగా ఎర్రన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణను సత్కరిస్తున్న ఆర్ఎంపీలు

నూతనంగా నిర్మించిన ఐఎంఏ హాలు భవనం

మాట్లాడుతున్న ఎస్ఐ

## గొడవలకు పోవద్దు

### చిల్లకల్లు ఎస్ఐ వి.సతీష్

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తిరుమలగిరి గ్రామంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ఎన్నికలు జరిగే వరకు ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు అందరూ కలిసి మెలిసి ఉండాలని, స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకునేలా చూడాలని కోరారు. గొడవలుపోకుండా కలిసిమెలిసి ఉండాలని, యువత భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు.

## పెద్దిరెడ్డిని కలిసిన ఆకుల

**ప్రజాశక్తి - భవానీ పురం :** సీనియర్ మంత్రి, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విజయవాడ పశ్చిమ వైసిపి నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుంగనూరు అసెంబ్లీలో వైసిపి తరుపున నామినేషన్ వేస్తున్న సంధర్భంగా తిరుపతిలో ఆయన నివాసంలో ఆకుల కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడ నుండి కనకదుర్గ దర్శనం చేసుకున్నారు. ఆకుల మాట్లాడుతు 13వ సారి శాసన సభ్యులుగా వైసిపి తరుపున నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు.

## ఓటు హక్కుపై అవగాహన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా పలు అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బంగూర్ సిమెంట్ సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి కె.ఎస్.రావు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం అవగాహణా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఓటు ప్రాధాన్యతను తెలియచేస్తూ కొత్త మల్టీమీడియా ప్రచారాన్ని తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఓట్ సాలిడ్, దేశ్ సాలిడ్ అనే ప్రచారంతో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో కూడా ప్రజలను చైతన్య పరచే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## 24 నుండి ఎన్ఎస్ఇ డెరివేటివ్స్ విడుదల

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ( ఎన్ఎస్ఈ), నిఫ్టీ నెక్స్ట్ ఈనెల 24వ తేదీ నుండి డెరివేటివ్‌లను విడుదల చేయనున్నట్లు సంస్థ ప్రతినిధి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన కాంట్రాక్టులను అందు బాటులోకి తీసుకు రావడంతో పాటు ఇండెక్స్ ఫ్యూచర్స్, ఇండెక్స్ ఆప్షన్స్, కాంట్రాక్ట్ సైకిల్స్‌ను ఎక్ఛేంజ్ అందిస్తుందన్నారు. క్యాష్ సెటిల్ డెలివేటివ్స్ కాంట్రాక్టుల గడువు కూడా ముగియనుందని దీనికి సంబంధించిన వివరాలను ఇండెక్స్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విద్యార్థులు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంపిణీని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వడగాలులు పెరిగే అవకాశం ఉందన్నారు. హోమియోపతి మాత్రల వల్ల చక్కటి ఉపశాంతి కలుగుతుందని, వడ దెబ్బను ఎదుర్కొనే శక్తి శరీరంలో తయా రవుతుందని అన్నారు. విద్యార్థులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రోగ్రామ్ ఆఫీసరస్లు కల్మాబేగం, డీ.పవన్‌కుమార్, ఎన్.సాంబ శివరావు, జే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.